
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
బుధవారం । 15 । అక్టోబర్ । 2025



సోమశిలలో 73.844 టీఎంసీలు
సోమశిల: జలాశయంలో మంగళవారానికి 73.844 టీఎంసీలు ఉన్నాయి. ఎగువ నుంచి 13,800 క్యూసెక్కుల వరద వస్తోంది. పెన్నానదికి 10,150 క్యూసెక్కులు, ఉత్తర కాలువకు 50, కండలేరుకు 3,600 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.1,30,290
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.11,746
మూడు శాతం జీఎస్టీతో	రూ.12,098
నవర (8 గ్రాములు)	రూ.96,784

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం 34.7 /25.5
జిల్లాలో బుధవారం ఉరుములు, మెరుపుల వాతావరణంతో అక్కడక్కడ చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది. మంగళవారం గాలిలో తేమ 66 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

ఎంఐహెచ్‌ఎం కన్వెన్షన్ హాల్ సీజ్



ఎంఐహెచ్‌ఎం కన్వెన్షన్ హాల్‌ను సీజ్ చేసిన టౌన్‌ప్లానింగ్ అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

నెల్లూరు (బారకాసు): నెల్లూరు నగర పాలక సంస్థ (42/3 సచివాలయం) పరిధిలోని డైకస్‌రోడ్డు, కోటమిట్ట షాదీమంజిల్ సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన ఎంఐహెచ్‌ఎం కన్వెన్షన్ హాల్ (కల్యాణ మండపం)ను మంగళవారం ఎస్‌ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు సీజ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన కల్యాణ మండపం విషయమై ఆనుకుని ఉన్న గృహ యజమాని కార్పొరేషన్ అధికారులకు పలు మార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతో హైకోర్టును ఆశ్రయించారు. దీంతో ఫిర్యాదును పరిశీలించిన ఉన్నత న్యాయస్థానం నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన ఎంఐహెచ్‌ఎం కన్వెన్షన్ హాల్‌పై తగు చర్యలు తీసుకోవాలని నగర పాలక కమిషనర్‌ను ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అయినా సంబంధిత ఎస్‌ఎంసీ అధికారులు చర్యలు తీసుకోవడంలో అలసత్వం వహించడంతో సదరు కల్యాణ మండపంలో శుభ కార్యాలయాలు జరుగుతూనే ఉన్నాయి. దీంతో ఈ నెల 4న 'సాక్షి'లో 'కట్టుకో.. పైసలిచ్చుకో..!' శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన నగర పాలక సంస్థ కమిషనర్ ఆదేశాల మేరకు టౌన్‌ప్లానింగ్ డీసీపీ ఇన్‌చార్జి రఘునందనరావు, టీపీఓ సతీష్‌కుమార్, అధికారులు తమ సిబ్బందితోపాటు రెవెన్యూ, విద్యుత్ శాఖల సిబ్బందితో కలిసి ఎంఐహెచ్‌ఎం కన్వెన్షన్ హాల్‌ను ప్రస్తుతానికి సీజ్ చేశారు. విద్యుత్ కనెక్షన్ కూడా తొలగించేలా చర్యలు చేపట్టారు. తదుపరి చర్యలు కమిషనర్ ఆదేశాల మేరకు చేపట్టనున్నామని డీసీపీ ఇన్‌చార్జి రఘునందనరావు తెలియజేశారు.

19న సీనియర్ బాస్కెట్ బాల్ జట్టు ఎంపిక

కందుకూరు రూరల్: ఉమ్మడి ప్రకాశం జిల్లా సీనియర్ మహిళలు, పురుషుల బాస్కెట్ బాల్ జట్ల ఎంపిక ఈ నెల 19న మధ్యాహ్నం 2 గంటలకు స్థానిక టీఆర్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహించనున్నట్లు జిల్లా అసోసియేషన్ ప్రెసిడెంట్ వలేటి రవీంద్ర, సెక్రటరీ తొట్టెంపూడి సుబ్బారావు మంగళవారం తెలిపారు. ఎంపికల్లో పాల్గొనే స్త్రీలు, పురుషులకు వయసు పరిమితి లేదన్నారు. ఎంపికలకు వచ్చే వారు ఆధార్‌కార్డు తీసుకురావాలన్నారు. ఎంపికైన జట్లు విశాఖపట్నంలో జరిగే 11వ సీనియర్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చాంపియన్‌షిప్‌లో పాల్గొంటారని తెలిపారు. నవంబర్ 7 నుంచి 10వ తేదీ వరకు పోటీలు జరుగుతాయని తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఎంపికలకు హాజరుకావాలని కోరారు.

కర్నూలు సభకు 250 బస్సుల కేటాయింపు

నెల్లూరు సిటీ: ఈ నెల16న కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలంలోని నన్నూరు వద్ద నిర్వహించే ప్రధానమంత్రి భారీ బహిరంగ సభకు నెల్లూరు జిల్లా నుంచి ఏపీఎస్‌ఆర్టీసీ 250 బస్సులు కేటాయించారు. ఆత్మకూరు డిపో నుంచి 31, కందుకూరు 35, కావలి 40, నెల్లూరు డిపో–1 నుంచి 40, నెల్లూరు డిపో–2 నుంచి 50, రాపూరు 25, ఉదయగిరి డిపో నుంచి 29 బస్సులు సభకు వెళ్లనున్నాయి. ఈ బస్సుల్లో పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులు ఎక్కువగా ఉండడంతో నేడు, రేపు ప్రయాణికులు, మహిళా ప్రయాణికులు ఇబ్బందులు పడే అవకాశం ఉంది.

ఎఫ్‌ఏలే టార్గెట్ ఆడిట్



- అధికార పక్షం జోలికి వెళ్లని తనిఖీ బృందాలు
- రూ.కోట్ల అవినీతిని కప్పెట్టిన వైనం
- రూ.12.72 కోట్ల పనుల్లో రూ.12.96 లక్షల రికవరీకి ఆదేశాలు
- ఈ మొత్తం పాత వారిపైనే అంట!

ఉపాధి హామీ పథకాన్ని అడ్డం పెట్టుకుని అధికార పక్ష నేతలు అడ్డంగా దోచేస్తున్నారు. రెక్కాడితే కానీ డొక్కాడని కూలీలకు బతుకుదెరువు కల్పించాలనే సంకల్పంతో అమలు చేస్తున్న పథకాన్ని ఆదాయవనరుగా మార్చుకున్నారు. గతంలో అధికారంలో ఉన్నప్పుడూ కూలీలకు పనులు కల్పించకుండా నిధులు బొక్కేశారు. తాజాగా అధికారంలోకి వచ్చాక అదే పంథాను అనుసరిస్తున్నారు. అధికారం దక్కగానే అప్పటికే ఏళ్ల తరబడి పనిచేస్తున్న ఎఫ్‌ఏ (ఫీల్డ్ అసిస్టెంట్)లను తొలగించి, వారి స్థానంలో టీడీపీ కార్యకర్తలను నియమించారు. ఈ క్రమంలో కొందరు ఎఫ్‌ఏలు కోర్టుకెళ్లి తమ ఉద్యోగాల్లో కొనసాగుతున్నారు. వీరిని ఎలాగైనా ఇంటికి పంపించి టీడీపీ వర్గీయులను నియమించుకోవాలనే ఉద్దేశంతో ఆ ఎఫ్‌ఏలే టార్గెట్‌గా ఆడిట్ జరుగుతోంది. అధికార పక్షం ఎఫ్‌ఏల అవినీతిని కప్పెడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కోర్టుకెళ్లి కొలువుల్లో ఉన్న వారిపైనే అవినీతి మరకలు



అధికార పార్టీ వారి ఉపాధి అక్రమాలపై డ్వామా పీడీని ప్రశ్నిస్తున్న కూలీలు



సోషల్ ఆడిట్ నిర్వహిస్తున్న అధికారులు

వింజమూరు (ఉదయగిరి): వింజమూరు మండలంలో జరిగిన ఉపాధి హామీ పనుల్లో అవినీతిని సోషల్ ఆడిట్ బృందాలు కప్పెట్టాయి. ఇదే తరుణంలో ప్రతిపక్ష ఎఫ్‌ఏలను టార్గెట్‌గా చేసుకొని ఆడిట్ టీమ్ తనిఖీలు నిర్వహించింది. అధికార పక్షం క్షేత్ర సహాయకులు ఎంత అవినీతికి పాల్పడినా వారిపై మచ్చ పడకుండా కాపాడే ప్రయత్నం జరిగింది. నియోజకవర్గ ముఖ్యనేత ఆదేశాల ప్రకారం ఆడిట్ బృందాలు ఉపాధి అక్రమాలన్నింటిని పాత క్షేత్ర సహాయకులపై నెట్టేసి, నిబంధలనకు విరుద్ధంగా నియమించుకున్న టీడీపీ క్షేత్ర సహాయకులకు అవినీతి మట్టి అంటకుండా తనిఖీలు చేసి నివేదికలు సిద్ధం చేశారు. వింజమూరు మండలంలో 2024 ఏప్రిల్ 1 నుంచి 2025 మార్చి 31వ తేదీ వరకు రూ.12.72 కోట్లతో జాతీయ ఉపాధి హామీ పనులు జరిగాయి. 18వ రౌండ్ సామాజిక తనిఖీలు 20 రోజుల పాటు క్షేత్ర స్థాయిలో తనిఖీలు చేశారు. అక్కడ గుర్తించిన అక్రమాలపై మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో డ్వామా పీడీ గంగాభవాని సమక్షంలో సామాజిక బహిరంగ చర్చా వేదిక నిర్వహించారు. ఇందులో రూ.12.96 లక్షలు అవినీతి జరిగినట్లు నిర్ధారించారు. అది కూడా కేవలం పాత క్షేత్ర సహాయకులే అవినీతికి పాల్పడినట్లు ధ్రువీకరించడం చూస్తే ఏ విధంగా కుట్రలు జరుగుతున్నాయో అర్థమవుతోంది. అది కూడా ఎప్పుడూ లేని విధంగా కూలీలకు చెల్లించిన రవాణా చార్జీల్లో (నిబంధనలు పాటించడం లేదంటూ) పాత ఎఫ్‌ఏల ఖాతాల్లో జమ చేసి వారిపై అవినీతి మరక అంటించారు. అదే తప్పులు చేసిన అధికార పార్టీకి చెందిన ఎఫ్‌ఏలపై ఆ అవినీతి సొమ్ము వేయకుండా కాపాడారు. డ్వామా పీడీని ఈ అంశంపై ప్రశ్నించినా పట్టించుకోలేదు.

కోర్టుకెళ్లి కొనసాగుతున్నారని..

మండలంలో 12 గ్రామ పంచాయతీల్లో కొన్నేళ్లుగా ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా వారే ఎఫ్‌ఏలుగా విధులు నిర్వహిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జనార్దనపురం, కాటేపల్లి, రాగిపాడు, నందిగుంట, ఊటుకూరు, శంఖవరం, నల్లగొండ్ల, బుక్కాపురం పంచాయతీల్లో అప్పటి వరకు ఉన్న ఎఫ్‌ఏలను ఎలాంటి కారణాలు లేకుండా తొలగించి టీడీపీ కార్యకర్తలను నియమించుకున్నారు. దీనిపై పాత వారు హైకోర్టును ఆశ్రయించగా వారినే కొనసాగించాలని కలెక్టర్‌కు కోర్టు ఉత్తర్వులిచ్చింది. దీంతో శంఖవరం తప్ప మిగితా వారు విధుల్లో చేరారు. ఈ క్రమంలో నియోజకవర్గ ముఖ్యనేత వారిని తొలగించే ప్రణాళికను అధికారులతో కలిసి రచించారు. సామాజిక తనిఖీలు చేసి వారిపై అవినీతి మరక అంటించి చర్యలు తీసుకుని, విధుల నుంచి తొలగించాలి అని డ్వామా అధికారులపై ఒత్తిడి తెచ్చారు. దీంతో వారు ఆగమేఘాలపై సామాజిక తనిఖీలు చేపట్టారు. తనిఖీల కోసం వచ్చిన ఆడిట్ బృందాలతో ఆ ముఖ్య నేత రహస్య సమావేశం నిర్వహించి తమ ప్లాన్ వివరించారు. ఆ ప్రకారం ఆడిట్ బృందాలు, డ్వామా అధికారులు, జిల్లా విజిలెన్స్ అధికారి విజయలక్ష్మి, సీనియర్ క్వాలిటీ కంట్రోల్ అధికారి సురేష్, స్టేట్ ప్రోగ్రామ్ మేనేజర్ ఈశ్వర్, ఎంపీడీఓ కేతు శ్రీనివాసరెడ్డి, ఏపీడీ మృదుల, ఎస్సార్పీ తిరుమలేష్ తదితరులు కలిసి ప్రజావేదికతో పా ఎఫ్‌ఏలే టార్గెట్‌గా అవినీతి మరకలు అంటించారు.

గుర్తించిన అంశాలు

- పనుల్లో కొలతల్లో తేడాలు, బినామీ మస్టర్లు, రవాణా చార్జీల్లో అక్రమాలు, గ్రామంలో లేని వారు పేరుతో మస్టర్లు వేయడం గుర్తించారు. ఈ వ్యవహారంలో టీఏ పాత్ర ఎక్కువగా ఉన్నప్పటికీ వారిపై చర్యలు తీసుకునే ప్రయత్నం చేయలేదు.
- కేవలం క్షేత్ర సహాయకులను టార్గెట్‌గా చేసుకుని రవాణా చార్జీలు అంశం తెరపైకి తెచ్చారు.
- నల్లగొండ్లలో రెండు పనులు సంబంధించి రవాణా చార్జీల రికవరీ పాత ఎఫ్‌ఏపై వేయగా, కొత్త ఎఫ్‌ఏఅ అదే తరహాలో అక్రమాలకు పాల్పడిన మూడు పనులకు సంబంధించి రికవరీ వేయలేదు.
- శంఖవరంలో రవాణా చార్జీల విషయంలో ఎఫ్‌ఏలపై రికవరీ వేయలేదు. దీనికి కారణం అతను కోర్టుకు వెళ్లకుండా రాజీనామా చేసి అధికార పార్టీకి సహకరించారు.
- వింజమూరు, గుండెమడుగుల తదితర పంచాయతీల్లో అదే తరహాలో రవాణా అక్రమాలు జరిగినా అధికార పక్షమనే కారణంతో చర్యలు తీసుకోలేదని పలువురు ఎఫ్‌ఏలు అధికారుల తీరును తప్పుపడుతున్నారు.
- ఈ సోషల్ ఆడిట్ పాత, గత ప్రభుత్వంలో నుంచి పనిచేస్తున్న వారిని టార్గెట్ చేస్తూ సాగిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

పంచాయతీల వారీగా రికవరీలు

పంచాయతీ	రూ.
ఏ కిస్తీపురం	58,922
బుక్కాపురం	9,096
చాకలికొండ	40,667
గుండెమదకల	11,089
జనార్దనపురం	1,30,174
కాటేపల్లి	1,60,432
నల్లగొండ్ల	82,640
నందిగుంట	3,30,427
రావిపాడు	1,32,024
శంఖవరం	500
ఊటుకూరు	2,86,436
వింజమూరు	53,500

రికవరీకి అదేశించారు.

జాతీయ మానవహక్కుల కమిషన్ విచారణ



ఆర్‌ఎస్సార్ ఇంజినీరింగ్ కళాశాలలో పర్యటిస్తున్న జాతీయ మానవ హక్కుల అధికారులు, మాజీ ఎమ్మెల్యే

బిట్రగుంట: బోగోలు మండలం కడనూతలలో రామిరెడ్డి సుబ్బరామిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల నిర్వహణకు స్థానిక అధికారులు అడ్డంకులు సృష్టిస్తుండడంపై జాతీయ మానవ హక్కుల కమిషన్ అధికారులు మంగళవారం సమగ్ర విచారణ చేపట్టారు. కళాశాల వసతి గృహం నుంచి పంట పొలాల్లోకి వస్తున్న వృథానీరు కారణంగా ఇబ్బందులు పడుతున్నామని స్థానిక టీడీపీ నాయకులు ఫిర్యాదు చేయడంతో పంచాయతీ అధికారులు ప్రాథమిక విచారణ కూడా చేపట్టకుండా, ప్రత్యామ్నాయం చూపించకుండా వృథా నీటిని బయటకు రాకుండా అడ్డుగా గ్రావెల్‌తో కట్టపోయించారు. దీంతో కళాశాలలోని సుమారు 2500 మంది విద్యార్థులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితిపై కళాశాల అధికారులు, స్థానిక అధికారులతో పాటు జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు కూడా ఫిర్యాదు చేశారు. దీంతో మానవహక్కుల కమిషన్ విచారణ విభాగానికి చెందిన అధికారులు కుల్బీర్‌సింగ్, యతిప్రకాశ్ శర్మ, సంజయ్‌కుమార్‌తో కూడిన బృందం కళాశాలను సందర్శించి వివరాలు సేకరించారు. వివిధ శాఖల అధికారులతో కలిసి విచారణ చేపట్టారు. కళాశాల నుంచి వృథా నీరు బయటకు వెళ్లే మార్గాలు, గ్రామస్తుల అభ్యంతరాలపై విచారణ నిర్వహించారు. కళాశాల కరస్పాండెంట్, మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, అధ్యాపకులు వాస్తవ పరిస్థితిని వివరించారు. స్థానిక టీడీపీ నాయకులు కూడా తమ అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో విచారణ కొనసాగిస్తున్నారు.

పింఛన్ల పునః పరిశీలన వాయిదా

నెల్లూరు (పొగతోట): ప్రభుత్వ ఆస్పత్రుల్లో నిర్వహించే దివ్యాంగుల పింఛన్ల పునః పరిశీలన ప్రక్రియ కార్యక్రమాన్ని ఈ నెల 15, 16, 17 తేదీల్లో నిలిపివేసినట్లు డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూలు జిల్లాలో ప్రధానమంత్రి పర్యటన సందర్భంగా అధికారుల అందుబాటులో లేని కారణంగా మూడు రోజుల పాటు పింఛన్ల పరిశీలన ప్రక్రియను నిలిపివేడం జరిగిందన్నారు. వచ్చే వారం నుంచి యథావిధిగా పింఛన్ల పునః పరిశీలన జరుగుతుందని తెలిపారు. దివ్యాంగులు ఈ వారం పింఛన్ల పునః పరిశీలనకు ఆస్పత్రుల వద్దకు వెళ్లొద్దని తెలిపారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో 23 కంపార్ట్‌మెంట్లు నిండాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 78,569 మంది స్వామి వారిని దర్శించుకోగా 27,482 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామి వారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.93 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

పొగాకు కిలో సగటు ధర రూ.152.67



మర్రిపాడు: పొగాకు కిలో సగటు ధర సగటు ధర రూ.152.67 లభించింది. మండలంలోని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో మంగళవారం 633 పొగాకు బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 927 బేళ్లు రాగా 633 బేళ్లను విక్రయించామని, మిగిలిన బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించినట్లు తెలిపారు. వేలంలో 71188.3 కిలోల పొగాకును విక్రయించగా రూ.10868573.70 వ్యాపారం జరిగింది. గరిష్ఠ ధర కిలోకు రూ.315, కనిష్ఠ ధర రూ.69 లభించింది. వేలంలో 11 కంపెనీలకు చెందిన వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

నకిలీ మద్యంపై సీబీఐ విచారణ చేపట్టాలి



ఆత్మకూరు ఎక్సైజ్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

- వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఎక్సైజ్ కార్యాలయం ఎదుట నిరసన

ఆత్మకూరు: రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ నేతలు నకిలీ మద్యాన్ని కుటీర పరిశ్రమగా మార్చేసి ఊరూరా బెల్టు షాపుల సరఫరా చేశారని, ఇప్పటికీ జరుగుతుందనే అనుమానాలు ఉన్నాయని సీబీఐతో విచారణ చేపడితే ఎక్కడెక్కడ మూలాలు ఉన్నాయో తెలుస్తాయని వైఎస్సార్‌సీపీ నేతలు డిమాండ్ చేశారు. ఊరూరా మద్యం దుకాణాలు, వీధికో బెల్టు షాపు చొప్పున ఏర్పాటు చేసి నకిలీ మద్యాన్ని ఏరులై పారిస్తూ ప్రజల ప్రాణాలను బలితీసుకుంటున్నారని మండిపడ్డారు. ప్రజల ప్రాణాలను హరిస్తున్న కూటమి ప్రభుత్వ మద్యం విధానాలకు వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ అధిష్టానం పిలుపు మేరకు, మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి సూచనలతో మంగళవారం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు ఆత్మకూరులోని ఎక్సైజ్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఎక్సైజ్ సీఐ బి వెంకటరమణమ్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి పాలనలో నకిలీ మద్యం తయారు కుటీర పరిశ్రమగా మారిందని, మద్యపానప్రియుల ఆరోగ్యానికి తూట్లు పొడిచేలా మద్యం రాష్ట్రంలో ఏరులై పారుతుందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మద్యం పాలసీ పారదర్శకంగా ఉండాలనే ఉద్దేశంతో నాటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అబ్కారీ శాఖ ద్వారానే కొనసాగించి దఫదఫాలుగా మద్యం షాపులను నియంత్రించేలా చర్యలు తీసుకున్నారన్నారు. అయితే కూటమి పాలన ఏర్పడ్డాక ఏడాదిన్నర కాలంలో పుట్టగొడుగుల్లా మద్యం దుకాణాలు, బెల్టుషాపులు ఏర్పాటయ్యాయని దుయ్యబట్టారు. నకిలీ మద్యం కారణంగా ప్రాణాలు కోల్పోతున్న వారి కుటుంబాలకు దిక్కెవరని ప్రశ్నించారు. ప్రస్తుతం బయట పడిన నకిలీ మద్యం కుటీర పరిశ్రమపై ఏమి సమాధానం చెబుతారని ప్రశ్నించారు. సీఎం చంద్రబాబు సిట్ విచారణకు ఆదేశించామని చెబుతున్నారని, ఈ సిట్ చంద్రబాబు ఇన్వెస్టిగేషన్ టీమ్ అంటూ ఆరోపించారు. సీబీఐతో విచారణ చేపట్టాలని వైఎస్సార్‌సీపీ డిమాండ్ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, పట్టణ పార్టీ అధ్యక్షుడు నాగులపాటి ప్రతాప్‌రెడ్డి, బూత్ కమిటీ జిల్లా అధ్యక్షుడు బాలిరెడ్డి సుధాకర్‌రెడ్డి, పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కొండా వెంకటేశ్వర్లు, మండలాల కన్వీనర్లు పులగం శంకర్‌రెడ్డి, బిజివేముల పిచ్చిరెడ్డి, చెన్ను వెంకటేశ్వరరెడ్డి, కంటాబత్తిన రఘునాథరెడ్డి, పార్టీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి పులిమి రమేష్‌రెడ్డి, కౌన్సిలర్ కొండా స్వరూపరాణి, పార్టీ నాయకులు బట్రెడ్డి జనార్దన్‌రెడ్డి, నోటి వినయ్ కుమార్‌రెడ్డి, బి.రవికుమార్‌రెడ్డి, ఎ.సుబ్బారెడ్డి, కల్పనారెడ్డి, ఎస్. ప్రసాద్, మీరామొహిద్దీన్, మునీర్, రహీం, జమ్రు, ఎస్.ప్రతాప్, గడ్డం శ్రీనివాసులురెడ్డి, హరిబాబు, బాలచెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ చేస్తే కఠిన చర్యలు



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా



మహిళా ఉద్యోగులు, విద్యార్థినులతో కలిసి ర్యాలీలో పాల్గొన్న హిమాన్షు శుక్లా

- కలెక్టర్ హిమాన్షు శుక్లా

నెల్లూరు (అర్బన్): భవిష్యత్ తరాల మనుగడకు ఆడ బిడ్డలను కాపాడుకోవడం మనందరి బాధ్యతని, లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హిమాన్షుశుక్లా అన్నారు. అంతర్జాతీయ బాలికాదినోత్సవాన్ని పురస్కరించుకుని వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ఐసీడీఎస్, వైద్యశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులు, మహిళా ఉద్యోగులతో భారీ ర్యాలీ జరిగింది. ఈ ర్యాలీని నగరంలోని డీకేడబ్ల్యూ కళాశాల వద్ద కలెక్టర్ హిమాన్షు శుక్లా జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ కేవీఆర్ పెట్రోల్ బంకు మీదుగా ట్రంకు రోడ్డులో కొనసాగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ బిడ్డలను పుట్టినప్పటి నుంచే ఆడైనా.. మగైనా సమానమే అనే భావంతో పెంచాలన్నారు. స్కానింగ్ ద్వారా ఆడబిడ్డ అని తెలుసుకుని అబార్షన్ చేయించి భ్రూణ హత్యలకు పాల్పడం అమానుషమన్నారు. ఎక్కడైనా లింగ నిర్ధారణ చేసినట్టు తేలితే అలాంటి డాక్టర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రేపటి తరాల ఆశాజ్యోతి, ఇంటికి కానుక, వెలుగు ఆడపిల్ల అన్నారు. ఆడ బిడ్డ చదువుకుంటే కుటుంబంతో పాటు సమాజం ఎంతో వృద్ధి చెందుతుందన్నారు. మహిళలు మగ వారితో సమానంగా అన్ని పనులు చేస్తున్నారన్నారు. ఆమె ఔన్నత్యం గొప్పదన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్, డీఎంహెచ్‌ఓ సుజాత, బాలల సంరక్షణ అధికారి సురేష్, ఇంటర్మీడియట్ ప్రాంతీయ అధికారి వరప్రసాద్, ఐసీడీఎస్, వైద్య ఆరోగ్యశాఖల సిబ్బంది, విద్యార్థినిలు పాల్గొన్నారు.

టైంపాస్ ఉద్యోగం

- గిరిజన సంక్షేమాభివృద్ధి కార్యాలయంలో ఇదీ తీరు
- రాజకీయ సిఫార్సులు, డిప్యుటేషన్లతో అవసరానికి మించి సిబ్బంది నియామకం
- 12 ఏళ్లుగా ఒక ఉద్యోగి అక్కడే విధులు
- అధికారులు ఎప్పుడొస్తారో.. ఎప్పుడు వెళ్లిపోతారో తెలియదు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): జిల్లా గిరిజన సంక్షేమాభివృద్ధి కార్యాలయంలో సిబ్బంది టైంపాస్ ఉద్యోగం చేస్తున్నారు. ఈ కార్యాలయంలో అవసరానికి మించి ఉద్యోగులు పోస్టింగ్‌లు పొంది విధుల్లేక కాలక్షేపం చేస్తున్నారు. నగరంలోని కొండాయపాళెం గేటు సెంటర్ వద్ద ఐటీడీఏ కార్యాలయంలో సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ కార్యాలయం ఉంది. ఈ కార్యాలయానికి ఒక సూపరింటెండెంట్ స్థాయి అధికారితో పాటు, ఒక జూనియర్ అసిస్టెంట్ కం టైపిస్ట్, ఇద్దరు అటెండర్లను నియమించారు. అయితే హాస్టల్ సిబ్బంది నుంచి ఒక కంప్యూటర్ ఆపరేటర్‌ను, మెయిల్స్ చూసేందుకు మరొకరిని, హాస్టల్ వెల్ఫేర్ అధికారులు నలుగురిని డిప్యుటేషన్ మీద ఇంకో మహిళను అటెండర్‌గా నియమించారు. అయితే సూపరింటెండెంట్ ఎప్పుడు వస్తారో.. ఎప్పుడు వెళ్లిపోతారో తెలియదు. జూనియర్ అసిస్టెంట్‌కు జీతాలు వస్తేనే పని ఉంటుంది. కంప్యూటర్ ఆపరేటర్ తపాలా, డిస్పాచ్‌లు ఉంటేనే పని. ఇక హాస్టల్ నుంచి తెచ్చుకున్న కంప్యూటర్ ఆపరేటర్, మెయిల్స్ వర్కర్లు పూర్తిగా రికమండేషన్‌తో వచ్చిన వారు కావడంతో వీరికి ఏ పనిలేకపోవడంతో కబుర్లతో కాలక్షేపం చేస్తున్నారు. ఆఫీసుకు రావడం యూ ట్యూబ్ వీడియోలు చూసుకోవడం, ముచ్చట్లు పెట్టుకోవడం మినహా ఇలాంటి ఏ పనులు చేయడం లేదని ఆ శాఖలోని ఉద్యోగులే బాహాటంగా చెప్పుకుంటున్నారు. ఒక మహిళా అటెండర్ అయితే 12 ఏళ్లుగా ఆ పక్క ఆఫీసుకు కొన్ని రోజులు ఈ పక్క ఆఫీసుకు కొన్ని రోజులు పూర్తి రికమండేషన్‌తో పని చేస్తూనే ఉన్నారు.

ఈ–ఆఫీసు పనులు జరగలేదు

కార్యాలయంలో జరగాల్సిన ఈ–ఆఫీసు పనులు ఇంత వరకు జరగడం లేదు. కంప్యూటర్ ఆపరేటర్ వస్తేనే శాలరీలు, బిల్లులు పనులు చేస్తుంటారు. గిరిజన సంక్షేమాభివృద్ధి శాఖలో రెసిడెన్షియల్ స్కూళ్లు 10, ఆశ్రమ స్కూళ్లు 2, కాలేజ్ హాస్టళ్లు 2, హాస్టల్ 1 జిల్లాలో ఉన్నాయి. వీటిలో ఒక్కొక్క స్కూల్‌లో ఎంత మంది విద్యార్థులు ఉన్నారో కచ్చితమైన వివరాలు కూడా ఇక్కడ అందుబాటులో లేవంటే ఆ కార్యాలయం ఎలా పని చేస్తుందో అర్థమైపోతుంది. గిరిజన ప్రాథమిక పాఠశాలల్లో టీచర్లకు నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదు. వివరాలు అడిగితే తెలియదంటున్నారు. ఆఫీసులో ఇంత మంది సిబ్బంది ఉంటే కొన్ని రెసిడెన్షియల్స్‌లో, హాస్టళ్లలో నాల్గో తరగతి ఉద్యోగులు ఉండాల్సిన దాని కంటే తక్కువ ఉన్నారు. ఇలా వీరి మీద పర్యవేక్షణ లేకుండా ఉండడంతో జిల్లా గిరిజన సంక్షేమ ప్రధాన కార్యాలయంలో పనులు జరగడం లేదని హాస్టల్ వార్డెన్లే ఫిర్యాదులు చేస్తున్నారు. జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి శ్రీనివాసులు బదిలీ అయి నాలుగు నెలలు కావస్తోంది. కనీసం ఆ బోర్డును కూడా మార్చలేని పరిస్థితి. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన జిల్లా గిరిజన సంక్షేమ అధికారి కె సుజాత అయినా సిబ్బందికి తగిన పనిని కేటాయించి అధికంగా ఉన్న వారిని అవసరమైన చోట్లకు పంపించి శాఖను గాడిలో పెట్టాలని పలువురు ఆ శాఖకు చెందిన వారే అభిప్రాయపడుతున్నారు.



ఐటీడీఏలో ట్రైబల్ వెల్ఫేర్ కార్యాలయం

పొగాకు ధరలు పతనం



ఈ ఏడాది పొగాకు వేలం ప్రక్రియ రైతుల పాలిట శాపంగా మారింది. ఆశించిన ధరలు రాకపోగా వేలం చివరి దశకు చేరేకొద్దీ మరింత పతనమవుతున్నాయి. వ్యాపారులంతా కుమ్మక్కై అంతర్జాతీయ పొగాకు మార్కెట్‌ను సాకుగా చూపి ఒక్కసారిగా ధరలు తగ్గిస్తుండటంతో రైతులకు కంటిమీద కునుకు ఉండటం లేదు. ధరలు ఇంకా తగ్గుతాయంటూ వ్యాపారులు, అధికారులు సంకేతాలిస్తున్నారు.

క్రమంగా తగ్గిస్తున్న వ్యాపారులు

- రోజుల వ్యవధిలో క్వింటాకు రూ.4,600ల తగ్గుదల
- అయినా లోగ్రేడ్ కొనుగోలుకు ముందుకు రాని వైనం
- కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసిన రైతుల ఆశలు ఆవిరి
- అదనపు అమ్మకాలపై జరిమానాలు



పొగాకు బేళ్లు

కందుకూరు: పొగాకు ధరలు ఒక్కసారిగా పతనమయ్యాయి. హై గ్రేడ్ కేజీ అత్యధికంగా రూ.346 ఉండగా, ప్రస్తుతం రూ.315 ఇస్తున్నారు. అదే సందర్భంగా కొన్ని వేలం కేంద్రాల్లో కేజీ రూ.300కు పడిపోయింది. అంటే ఒక క్వింటాపై రూ.4,600ల వరకు రైతులు నష్టపోతున్నారు. మరోవైపు మీడియం, లోగ్రేడ్ పొగాకు ధరలు మరింత దారుణంగా పతనమయ్యాయి. అన్ని గ్రేడ్‌ల ధరలను పరిగణలోకి తీసుకుని సరాసరి అంచనా వేస్తే కేజీకి కేవలం రూ.217లు మాత్రమే ఇప్పటి వరకు వచ్చింది. మొత్తంగా ఈ ఏడాది క్వింటాకు కనీసం రూ.20 వేలు కూడా వచ్చే పరిస్థితి లేకుండా పోయింది.

గతేడాది ఇలా..

గతేడాది పొగాకు కేజీ సరాసరి ధర రూ.360ల వరకు వచ్చింది. అంటే నాటికి, ప్రస్తుతానికి వ్యత్యాసం రూ.143గా ఉంది. దీనిని బట్టి రైతులు ఏ విధంగా నష్టాలను మూటగట్టుకున్నారో అర్థం చేసుకోవచ్చు. వేలం ప్రక్రియ మరో రెండు నెలలు మాత్రమే మిగిలి ఉంది. ప్రస్తుతం కొనసాగుతున్న ధరల తగ్గుదల ఇంకా కొనసాగే అవకాశం ఉందని సంకేతాలు వెలువడుతున్నాయి. రోజూ వేలంలో ఎంతో కొంత ధరలను వ్యాపారులు తగ్గించుకుంటూనే వస్తున్నారు.

అదనంగా సాగు

పొగాకు బోర్డు ఒంగోలు రీజియన్ పరిధిలోని 11 వేలం కేంద్రాలున్నాయి. ప్రకాశం జిల్లా పరిధిలో 7, నెల్లూరు జిల్లా పరిధిలో కందుకూరు – 1, కందుకూరు – 2, డీసీపల్లి, కలిగిరి వేలం కేంద్రాలున్నాయి. వీటి పరిధిలో 2024 – 25 పంట కాలంలో 104.6 మిలియన్ కేజీలు పండించేందుకు బోర్డు అనుమతి ఉంది. కానీ ఈ ఏడాది 158.6 మిలియన్ కేజీల వరకు ఉత్పత్తులు రావొచ్చని బోర్డు అధికారులు అంచనా వేస్తున్నారు. ఇందులో ఇప్పటికే అధికారిక అమ్మకాలు పూర్తి కాగా, ప్రస్తుతం అదనపు పొగాకు అమ్మకాలు సాగుతున్నాయి. 54 మిలియన్ కేజీలు అదనంగా ఉంది. ఈ అమ్మకాలపై బోర్డు మూడు శ్లాబ్‌లుగా ప్రస్తుతం జరిమానాలు వసూలు చేస్తుంది. రైతు తన కోటాను మించి జరిగే 10 శాతం అదనపు పొగాకు అమ్మకాలపై ఎటువంటి జరిమానాలు విధించడం లేదు. 10 నుంచి 20 శాతం అదనపు పొగాకుపై 2 శాతం చెల్లించాల్సి ఉంటుంది. 20 శాతం మించి జరిగితే 3 శాతం వరకు కట్టాలి. ఇక బోర్డులో రిజిస్టర్ కాని రైతులు పండించే అనధికారిక పొగాకును అమ్ముకోవాలంటే 6 శాతం వరకు జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. ఈలెక్కన ఒక రైతు రూ.లక్ష విలువ చేసే ఉత్పత్తులను అమ్ముకుంటే రూ.3 వేల వరకు జరిమానా చెల్లించాల్సి ఉంది. దీనికి రెగ్యులర్‌గా విధించే సర్వీస్ చార్జీ, కేజీకి ఒక రూపాయి పెనాల్టీ అదనం. అసలే ధరల్లేక అల్లాడుతున్న రైతులు ఈ జరిమానాల రూపంలో మరింత నష్టపోతున్నారు.

లోగ్రేడ్ కొనే దిక్కు లేదు

లోగ్రేడ్‌ను కొనుగోలు చేసేందుకు వ్యాపారులు ముందుకే రావడం లేదు. కేజీ ప్రస్తుతం రూ.70కు పడిపోయింది. అయినా కొనే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లోగ్రేడ్ బేళ్లను వేలం కేంద్రాలకు తీసుకురావడం .. అమ్ముడుపోక తిరిగి ఇంటికి తీసుకెళ్లడం రైతులకు పరిపాటిగా మారిపోయింది. రవాణా చార్జీలు, వెయిట్‌లాస్ రూపంలో మరింత నష్టం వస్తోంది. ఒకసారి వేలం కేంద్రానికి తీసుకురావాలంటే ఒక బేల్‌కి రూ.200లు ఖర్చవుతుండగా, శాంపిల్స్ రూపంలో బేల్‌కి ఐదారు కేజీలను నష్టపోవాల్సి వస్తుంది. ఇలా రెండు, మూడుసార్లు కేంద్రాలకు బేళ్లను తీసుకురావడం అదనపు భారంగా మారుతోంది. ఈ ఏడాది అన్నదాతలకు సాగు ఖర్చులు కూడా వచ్చే పరిస్థితి లేకుండా పోయింది.

ధరలు భారీగా తగ్గించారు



వారం, పదిరోజుల వ్యవధిలో పొగాకు ధరలు బాగా తగ్గించారు. హైగ్రేడ్ పొగాకు క్వింటాకు రూ.30 వేలు కూడా ఇవ్వడం లేదు. ఇక లోగ్రేడ్‌ను అసలు కొనుగోలు చేయడం లేదు. దీంతో ఈ ఏడాది భారీగా నష్టాలొచ్చే అవకాశం ఉంది. ధరలు మరింత తగ్గుతాయని చెబుతున్నారు. ఇంకెంత తగ్గిస్తారో అర్థం కావడం లేదు. మొత్తంగా బ్యారన్‌కు రూ.2 లక్షల వరకు కచ్చితంగా నష్టం వస్తుంది.

– నలగర్ల రవి, పొగాకు రైతు, పోలినేనిపాళెం

రైతులను ఆదుకోవాలి



ఈ సంవత్సరం మొదటి నుంచి పొగాకు ధరలు అంతంతమాత్రంగానే ఉన్నాయి. ఇప్పుడు మళ్లీ ధరలు ఒక్కసారిగా తగ్గించారు. ఇలా ఎందుకు చేస్తున్నారో అర్థం కావడం లేదు. పొగాకు బోర్డు వద్ద రైతుల కార్పస్‌ఫండ్ రూ.వేల కోట్లు ఉంది. ఆ డబ్బులతో ఇటువంటి కష్టసమయంలో రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి.

– కట్టా హనుమంతరావు, పొగాకు రైతు, వలేటివారిపాళెం

క్లుప్తంగా

పర్యాటక రంగంపై పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరించిన వీసీ తదితరులు

వెంకటాచలం: టూరిజం ఇన్నోవేటివ్ పాత్‌వేస్ టు సస్టైనబుల్ లైవ్లీహుడ్స్ – డైవర్సిఫయింగ్ రూరల్ ఆక్యుపేషన్స్ అనే పుస్తకాన్ని మండలంలోని కాకుటూరు వద్దనున్న విక్రమ సింహపురి యూనివర్సిటీలో వీసీ అల్లం శ్రీనివాసరావు మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో పర్యాటక రంగం చాలా కీలకమైందన్నారు. యువత సృజనాత్మక ఆలోచనలతో ఈ రంగంలోకి రావాలని పిలుపునిచ్చారు. పుస్తక రచయిత డాక్టర్ మైల త్యాగరాజు మాట్లాడుతూ గ్రామీణ సమాజాల్లో ఉపాధి వైవిధ్యానికి పర్యాటకం ఎలా దోహదపడుతుందో ఈ పుస్తకంలో విశ్లేషించామని చెప్పారు. సుస్థిర పర్యాటక పద్ధతులు భారత దేశం వంటి దేశాలకు అత్యంత అవసరమన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత, ప్రిన్సిపల్ సీహెచ్ విజయ, పర్యటక విభాగాధిపతి డాక్టర్ పి.సుజాత తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అధిక ఆదాయం వచ్చేలా చర్యలు

- హార్టికల్చర్ ఏడీ సుబ్బారెడ్డి



మాట్లాడుతున్న ఏడీ సుబ్బారెడ్డి

నెల్లూరు(పొగతోట): నిమ్మతోటలు సాగు చేస్తున్న రైతులకు అధిక ఆదాయం వచ్చేలా చర్యలు చేపడుతున్నామని హార్టికల్చర్ ఏడీ సుబ్బారెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక వ్యవసాయ పరిశోధన క్షేత్రంలో నిమ్మ రైతులకు నిర్వహించిన జిల్లా స్థాయి సదస్సులో ఏడీ మాట్లాడారు. రైతులు శాస్త్రవేత్తల సూచనలు, సలహాలు పాటించాలన్నారు. కేవీకే శాస్త్రవేత్త డి.తిరుపాల్, డాక్టర్ కవిత, ఏడీహెచ్ అనురాధ మాట్లాడారు. పంట కోత అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తల్ని వివరించారు. సదస్సులో డాక్టర్ కె.వెంకటసతీష్, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు తరలిస్తుండగా..

- గేదెను ఢీకొని బొలెరో ట్రక్కు బోల్తా



రోడ్డుపై పడిన మద్యం బాటిళ్లు

కొడవలూరు: మద్యం లోడుతో ఉన్న బొలెరో ట్రక్కు గేదెను ఢీకొని బోల్తా పడింది. ఈ ఘటన జాతీయ రహదారిపై గండవరం ఫ్లై ఓవర్‌పై మంగళవారం రాత్రి జరిగింది. స్థానికుల కథనం మేరకు.. నెల్లూరు రూరల్ మండలంలోని మద్యం డిపో నుంచి కావలిలోని మద్యం దుకాణాలకు ట్రక్కు బయలుదేరింది. గండవరం ఫ్లై వర్‌పై గేదె కనిపించక దాన్ని ఢీకొట్టింది. దీంతో వాహనం తిరగబడింది. గేదెకు తీవ్ర గాయాలై నడవలేని స్థితికి చేరుకుంది. ట్రక్కు డ్రైవర్‌కూ గాయాలయ్యాయి. అట్టపెట్టెల్లో ఉన్న కొన్ని మద్యం బాటిళ్లు రోడ్డుపై పడ్డాయి. అందులో కొన్ని పగిలిపోయాయి.

గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

నెల్లూరు(క్రైమ్): ఆర్థిక సమస్యలో, కుటుంబ కలహాలో, మరే ఇతర కారణాలో తెలియదు గానీ ఓ వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నెల్లూరు నగరంలోని ప్రధాన రైల్వే స్టేషన్ – వేదాయపాళెం మధ్యలోని కొండాయపాళెం గేటు సమీపంలో మంగళవారం జరిగింది. రైల్వే పోలీసుల కథనం మేరకు.. సుమారు 50 సంవత్సరాల వయసున్న గుర్తుతెలియని వ్యక్తి మంగళవారం మెమూ రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు గుర్తించి రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై హరిచందన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడు తెలుపు రంగు షర్ట్, బులుగు రంగు చెక్స్ లుంగీ ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్	రూ.122
లేయర్	రూ.122
బ్రాయిలర్ చికెన్	రూ.222
స్కిన్‌లెస్ చికెన్	రూ.244
లేయర్ చికెన్	రూ.207

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి	రూ.30
సన్నవి	రూ.20
పండ్లు	రూ.10

నగరంలో ఎస్పీ ఆకస్మిక తనిఖీలు

- బహిరంగ మద్య సేవనంపై 52, డ్రంక్ అండ్ డ్రైవ్‌పై 17 కేసుల నమోదు



సంతపేట ఇన్‌స్పెక్టర్ సోమయ్యతో మాట్లాడుతున్న ఎస్పీ అజిత

నెల్లూరు(క్రైమ్): ఎస్పీ డాక్టర్ అజిత సోమవారం అర్ధరాత్రి నెల్లూరు నగరంలో పర్యటించారు. నాలుగుకాళ్ల మండపం, ఇరుకళల పరమేశ్వరి దేవస్థానం, నెల్లూరు బ్యారేజ్, మెడికవర్ వైద్యశాల, బుజబుజనెల్లూరు, అయ్యప్ప గుడి సెంటర్, కరెంటాఫీస్ సెంటర్, ఆర్టీసీ బస్టాండ్, వీఆర్సీ తదితర ప్రాంతాల్లో ఎస్పీ ఆకస్మికంగా తనిఖీలు చేశారు. అనంతరం బీట్స్‌ను పరిశీలించి బీట్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో నేర నియంత్రణలో భాగంగా రాత్రిపూట వాహనాల తనిఖీలు ముమ్మరం చేశామన్నారు. రౌడీయిజం, దౌర్జన్యాలు, దోపిడీ, దొంగతనాల కట్టడిపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. అదే విధంగా రోడ్డు ప్రమాదాల నివారణ, అసాంఘిక కార్యకలాపాలను అడ్డుకట్ట వేసేందుకు నాకా బందీని జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నామన్నారు.

- జిల్లాలో సోమవారం అర్ధరాత్రి 1,580 వాహనాలను తనిఖీ చేశారు. కాగా బహిరంగ మద్య సేవనానికి సంబంధించి 52 కేసులు, డ్రంక్ అండ్ డ్రైవ్‌కు సంబంధించి 17 కేసులు నమోదు చేశారు. 3 వాహనాలు సీజ్ చేశారు. ఎంవీ యాక్ట్ కేసులు 179 నమోదు చేసి రూ.58,795 అపరాధ రుసుము విధించారు.

బాధిత కుటుంబాలకు నగదు బాండ్ల అందజేత

- ప్రభుత్వం నుంచి ఇంకా అందని పరిహారం



బాండ్లు అందుకున్న వారితో సీపీఎం నాయకులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఆత్మకూరు నియోజకవర్గం పెరమన గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై కారును ఇసుక టిప్పర్ ఢీకొట్టిన ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఇందుకూరుపేట, నెల్లూరు నగరం గుర్రాలమడుగు సంఘం ప్రాంతానికి చెందిన ఏడుగురు మృతిచెందిన విషయం తెలిసిందే. దీంతో సీపీఎం నేతలు బాధిత కుటుంబాలకు నష్టపరిహారం ఇచ్చేందుకు స్పష్టమైన హామీ ఇవ్వాలని నిరసన కార్యక్రమం చేపట్టారు. కాగా ఇప్పటికీ ప్రభుత్వం నుంచి మృతుల కుటుంబాలకు ఒక్క రూపాయి నష్టపరిహారం అందలేదు. బాధిత కుటుంబాలకు నష్టపరిహారం అందించి ఆర్థిక భరోసా కల్పించాలని నాయకులు టిప్పర్ యజమాని రవీంద్రారెడ్డితో మాట్లాడారు. అతను అంగీకరించి ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్‌కు సంబంధించి రూ.2,30,000 చొప్పున బాండ్లను అందజేశారు. మంగళవారం రాత్రి గుర్రాలమడుగు సంఘం ప్రాంతంలో నాయకులు చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, నాయకులు కాయం శ్రీనివాసులు, సుధాకర్, బాబు, నారాయణ, సంపూర్ణమ్మ, వెంకటేశ్వర్లు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాఠాలు చెప్పి ఇంటికెళ్తుండగా..

- రైలు ఢీకొని టీచర్ మృతి



పద్మావతి (ఫైల్)

నెల్లూరు(క్రైమ్): ఆమె ప్రభుత్వ ఉపాధ్యాయురాలు. బడిలో విద్యార్థులకు పాఠాలు చెప్పి ఇంటికి బయలుదేరింది. ఈ క్రమంలో పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతిచెందింది. మృతదేహం గుర్తుపట్టలేని విధంగా తయారైంది. అతికష్టంపై రైల్వే పోలీసులు మృతురాలు ఎవరనే విషయాన్ని గుర్తించి బాధిత కుటుంబానికి సమాచారం అందించారు. ఈ ఘటన నెల్లూరు వేదాయపాళెం రైల్వే గేటు వద్ద మంగళవారం చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల కథనం మేరకు.. వేదాయపాళెం జనశక్తినగర్‌లో విశ్రాంత బ్యాంక్ మేనేజర్ రామాంజనేయులు, పద్మావతి (50) దంపతులు నివాసముంటున్నారు. ఇద్దరు కుమార్తెలున్నారు. వారికి వివాహమైంది. ఒకరు బెంగళూరులో, మరొకరు హైదరాబాద్‌లో ఉంటున్నారు. పద్మావతి మనుబోలు మండలం కొలనకుదురు ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తోంది. ఆమె రోజూ ఇంటి నుంచి పాఠశాలకు వెళ్లి వచ్చేవారు. మంగళవారం కూడా బడిలో విధులు ముగించుకుని వేదాయపాళెంలో దిగి ఇంటికి బయలుదేరారు. రైల్వే గేటు వేసి ఉంది. కొద్దిదూరంలో పట్టాలపై గూడ్సు రైలు ఆగి ఉండటాన్ని చూసింది. పట్టాలు దాటుతుండగా మరోరైలు వేగంగా వచ్చి ఆమెను ఢీకొంది. దీంతో అక్కడికక్కడే చనిపోయింది. ప్రమాద ఘటనపై సమాచారం అందుకున్న రైల్వే ఎస్సై ఎస్.హరిచందన తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి బాధిత కుటుంబానికి సమాచారం అందించారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు. ఎస్సై హరిచందన కేసు దర్యాప్తు చేస్తున్నారు.

16న హుండీ కానుకల లెక్కింపు

సూళ్లూరుపేట : పట్టణంలోని చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమాన్ని ఈనెల 16న ఉదయం 9 గంటలకు ప్రారంభించనున్నామని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ అండ్ ముఖ్య కార్యనిర్వహణాధికారి బి.ప్రసన్నలక్ష్మి మంగళవారం తెలిపారు. దేవదాయ అధికారుల సమక్షంలో నిర్వహించనున్న లెక్కింపులో పాల్గొనేందుకు ఆసక్తి కలిగిన భక్తులు పంచె, బనియన్‌తో రావాలని తెలియజేశారు.



అలా.. నడుచుకుంటూ..

కలెక్టర్ హిమాన్షు శుక్లా సామాన్యుడిలా మంగళవారం కేవీఆర్ పెట్రోల్ బంకు నుంచి పాత ఎస్పీ కార్యాలయం రోడ్డులో నడుకుంటూ వెళ్తూ అందరిని ఆకర్షించారు. బాలికా దినోత్సవం సందర్భంగా డీకేడబ్ల్యూ కళాశాల వద్ద ర్యాలీని ప్రారంభించారు. కేవీఆర్ పెట్రోల్ బంక్ వరకు ఆయన ర్యాలీలో పాల్గొన్నారు. కలెక్టర్ కంటే ముందుగా కారు వెళ్లడం, అక్కడ ట్రాఫిక్‌లో ఇరుక్కుపోవడంతో తన వాహనాన్ని వదిలేసి సామాన్యుడిలా సిబ్బందితో నడుచుకుంటూ వెళ్తున్న దృశ్యాన్ని 'సాక్షి' కెమెరా క్లిక్ మనిపించింది.

కోళ్ల వ్యర్థాల వాహనం సీజ్

పొదలకూరు: తమిళనాడు రాష్ట్రం సేలం నుంచి జిల్లాలోని జొన్నవాడ చేపల చెరువుల వద్దకు కోళ్ల వ్యర్థాలను తరలిస్తున్న మినీ వ్యాన్‌ను పొదలకూరు పోలీసులు మంగళవారం సీజ్ చేశారు. వ్యర్థాలను తరలిస్తున్న మణికంఠపై కేసు నమోదు చేశారు. రెవెన్యూ, మత్స్య, పోలీసు శాఖలు కలిసి వ్యర్థాలను అటవీ ప్రాంతంలో పాతిపెట్టారు.

కండలేరులో 59.880 టీఎంసీలు



రాపూరు: కండలేరు జలాశయంలో మంగళవారం నాటికి 59.880 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 3,400 క్యూసెక్కుల నీరు చేరుతోందన్నారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 1,500, పిన్నేరు కాలువకు 300, లోలెవల్ కాలువకు 40, హైలెవల్ కాలువకు 200, మొదటి బ్రాంచ్ కాలువకు 5 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

తహసీల్దార్‌పై మందుబాబు వీరంగం

- పోలీసులకు ఫిర్యాదు
- తల్లిదండ్రుల వేడుకోలు
- మందలించి వదిలేసిన వైనం

లింగసముద్రం: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కార్యాలయం నుంచి ఇంటికెళ్తున్న తహసీల్దార్‌తో మందుబాబు గొడవపడ్డాడు. దీంతో సదరు వ్యక్తిపై తహసీల్దార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదులోని వివరాల మేరకు.. లింగసముద్రం తహసీల్దార్ ఎం.కోటేశ్వరరావు సోమవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ ముగిసిన తర్వాత ఇంటికి బయలుదేరుతున్నాడు. అదే సమయంలో గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మద్యం తాగి ఆఫీస్ రూంలో ఉన్న తహసీల్దార్ వద్దకు వెళ్లి ఇప్పటి వరకు ఇక్కడ ఏం పని?, ఎందుకు ఉన్నావంటూ కేకలు వేసి దుర్భాషలాడాడు. దీంతో తహసీల్దార్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్సై నారాయణ సిబ్బందిని పంపించారు. పోలీసులు మందుబాబును పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం తహసీల్దార్ స్టేషన్‌కు వెళ్లి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. అయితే మంగళవారం సదరు విద్యార్థి తల్లిదండ్రులు, బంధువులు తహసీల్దార్‌ను కలిసి తమ కుమారుడు చదువుకుంటున్నాడని, కేసు నమోదైతే ఇబ్బంది పడతాడని, తప్పును మన్నించాలని వేడుకున్నారు. దీంతో తహసీల్దార్ పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదును వెనక్కి తీసుకోవడంతో కోటేశ్వరరావును పోలీసులు మందలించి వదిలేశారు.

టీచర్లను రిలీవ్ చేయాలని డిమాండ్



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ నాయకులు

నెల్లూరు(టౌన్): 'ఈ ఏడాది జూన్‌లో బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేయని కారణంగా మానసిక వేదనకు గురవుతున్నారు. వారిని వెంటనే రిలీవ్ చేయాలి' అని ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ హజరత్ డిమాండ్ చేశారు. మంగళవారం నెల్లూరు జిల్లా విద్యాశాఖ కార్యాలయం వద్ద విలేకరుల సమావేశంలో మాట్లాడారు. టీచర్లను రిలీవ్ చేయకుంటే ఈనెల 17న జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఎదుట 48 గంటల నిరహార దీక్ష చేయనున్నట్లు తెలిపారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని అన్ని మండలాల్లో టీచర్లను రిలీవ్ చేయాలని, లేకుంటే జరగబోయే పరిణామాలకు జిల్లా విద్యాశాఖాధికారి పూర్తి బాధ్యత వహించాలని హెచ్చరించారు. అంతర్ జిల్లాల బదిలీల్లో కమిషనర్, డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఇచ్చిన జీఓలను బేఖాతరు చేసి కొన్ని ఖాళీలపై వ్యక్తిగత నిర్ణయాలు తీసుకుని చూపడం జరిగిందన్నారు. డీఎస్సీ 2025 నూతన ఉపాధ్యాయులు ప్రవేశం పొందిన సందర్భంగా వారికి 1:1 రేషియోలో ఖాళీలను చూపించారన్నారు. నూతన టీచర్లకు ఎస్జీటీ వేకెన్సీల్లో 15 కంటే తక్కువ రోల్ ఉన్న పాఠశాలలను వేకెన్సీలో చూపించారన్నారు. ఉదాహరణకు తడ మండలం ఇరకం ఎంపీపీఎస్‌లో – 4, వాకాడు మండలం మాధవరం ఎంపీపీఎస్‌లో – 5, రెడ్డిపాళెం ఎంపీపీఎస్‌లో – 10, దక్కిలి మండలం పాతనాలపాడు ఎంపీపీఎస్‌లో – నలుగురు ఉన్నారన్నారు. సమావేశంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దశరథరాములు, నాయకులు పాల్గొన్నారు.